సాదాబైనామా దరఖాస్తులకేదీ మోక్షం!

సాగులో ఉన్నా హక్కులు లేక రైతుల దైన్యం

న్యూస్‌టుడే, గోదావరిఖని

భూ యాజమాన్య హక్కుల కోసం చిన్న సన్నకారు రైతులు ఎదురుచూస్తున్నారు. తెల్లకాగితాలు, స్టాంపు పేపర్లతో ఒప్పందం చేసుకుని కొనుగోలు చేసిన భూములకు గత ప్రభుత్వం హక్కులు కల్పిస్తామన్న ప్రకటన నెరవేరలేదు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు.. ఆర్థిక ప్రయోజనాలకు భూ యాజమాన్య హక్కులు తప్పనిసరిగా మారాయి. దీంతో రైతుల ఇబ్బందులను గుర్తించిన గత ప్రభుత్వం మూడున్నరేళ్ల క్రితం సాదా బైనామాలన్నింటినికి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని ప్రకటించగా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. నేటికీ మోక్షం లభించడంలేదు.



తరతరాలుగా సాగు

చాలామంది రైతులు సాగు చేసుకుంటున్న కొన్ని భూములకు వారి పేరుపై ఎలాంటి పత్రాలు లేవు. పూర్వకాలంలో తెల్లకాగితాలు, స్టాంపు పేపర్లపై ఒప్పందం చేసుకుని కొనుగోలు చేసిన భూములు సాగుచేసుకుంటూ వస్తున్నారు. అధికారికంగా రికార్డుల్లో పాత వారి పేరుతోనే ఉంటుంది. దీంతో రికార్డుల్లో ఉన్నవారికి సంబంధించిన వారసులు, కుటుంబ సభ్యుల నుంచి కొన్ని గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొన్నిచోట్ల వారసులు వచ్చి అది తమ భూమి అంటూ సాగులో ఉన్నవారిని బెదిరింపులకు పాల్పడిన సందర్భాలున్నాయి. కొన్ని సంఘటనలు ఠాణాల వరకూ వెళ్లాయి.

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తులు	
కరీంనగర్:	26,871
పెద్దపల్లి:	35,580
జగిత్యాల:	35,010
సిరిసిల్ల:	15,056

తమకే హక్కు ఉందంటూ ఒత్తిడి

గతంలో సాదాబైనామాతో కొనుగోలు చేసిన భూముల్లో కొన్నింటికి ప్రస్తుతం విలువ పెరిగింది. వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన రైతులకు.. కొన్ని ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అనుకూలంగా మారాయి. దీంతో రికార్డుల్లో ఉన్నవారితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారికంగా తమకే హక్కు ఉందంటూ ఒత్తిడి చేస్తున్నారు. లేదంటే ప్రస్తుతం ఉన్న విలువ ప్రకారం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. కొన్నేళ్లుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్న చిన్న, సన్నకారు రైతులు ఊహించని పరిణామాలతో ఆందోళన చెందుతున్నారు.

సర్కారుకు ఆదాయం

ఎంతోకాలంగా పరిష్కారం కాని సాదాబైనామా భూములకు ప్రభుత్వం హక్కు కల్పించేందుకు తీసుకున్న నిర్ణయంతో యూజర్ ఛార్జీల కింద రైతులు భారీగానే చెల్లించారు. దీంతో భారీ మొత్తం లోనే ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. మీసేవా కేంద్రాల ద్వారా ఈ ప్రక్రియను చేపట్టగా. . ఆయా నిర్వాహకులకు దస్తావేజుల విక్రయాల పేరుతో ఆదాయం లభించింది.

సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదని అధికారులు చెబుతున్నారు. కొత్తగా 2024 ఆర్ఓఆర్ చట్టం ద్వారా కొన్ని మార్పులు చేస్తున్నారు. అందులో ఏమైనా దీనికి సంబంధించిన అంశం చేర్చితే పరిష్కారానికి అవకాశం ఉండనుంది.

జిల్లాకు తేలికపాటి వర్షసూచన

జగిత్యాల వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో రాగల అయిదు రోజుల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షం కురిసే అవకాశముందని పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సాంకేతిక అధికారిణి బి.శ్రీలక్ష్మి తెలిపారు. గాలిలో తేమ 55-91 శాతం, ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా 24, గరిష్ఠంగా 30-32 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతాయని పేర్కొన్నారు.

సిబ్బంది కొరత.. పారదర్శకత ఎలా?

న్యూస్‌టుడే, సారంగాపూర్

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో కొంతకాలంగా ఏపీవో, సాంకేతిక సహాయకుల (టీఏ) లేక ఉన్న సాంకేతిక సహాయకుల (టీఏ)కే అదనపు బాధ్యతలు అప్పగించారు. వారికి కేటాయించిన పనుల పర్యవేక్షణతోపాటు అదనంగా వారి పనులు చూసుకోవాల్సి వస్తోంది. జిల్లాలో పలు సాంకేతిక, క్షేత్ర సహాయకుల పోస్టులు కూడా ఖాళీగా ఉండడమే కాకుండా నూతనంగా ఏర్పడిన పంచాయతీలకు క్షేత్ర సహాయకుల నియామకాలు లేకపోవడంతో పాత పంచాయతీ పరిధిలో వారే చూసుకోవాల్సిన పరిస్థితి. గ్రామాల్లో వలసల నివారణతో పాటు ప్రతి కూలీకి పని కల్పించాలన్న ఉద్దేశ్యంతో కేంద్రం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టింది. గ్రామాల్లో వందల మంది కూలీలు పనులకు వెళ్తుండటంతోపాటు వివిధ అభివృద్ధి పనులు కింద రూ.కోట్ల విలువ గల పనులు నిర్వహిస్తున్నారు. ఆయా పనుల పర్యవేక్షించేందుకు సిబ్బంది లేమి, కూలీ భద్రతపై అధికారులు చేతులెత్తేయడంతో పనుల్లో నాణ్యత లేకుండా పోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాలో ఇలా..	
జాబ్ కార్డు ఉన్న కుటుంబాలు	1,65,700
మొత్తం కూలీల సంఖ్య	2,97,962
పురుషులు	1,33,822
మహిళలు	1,64,140
దివ్యాంగ కూలీలు	3,381



పనులు నిర్వహిస్తున్న కూలీలు (పాత చిత్రం)

ఇదీ పరిస్థితి

✦ జిల్లాలోని 380 పంచాయతీల పరిధిలో నిత్యం వివిధ పనుల నిమిత్తం కూలీలు పనులకు వెళ్తున్నారు. ఆయా కూలీల చేపట్టే పనుల పర్యవేక్షణ పూర్తి స్థాయిలో సిబ్బంది నియామకాలు లేకపోవడంతో పనుల్లో అవకతవకలు జరుగుతున్నట్లు ఏటా నిర్వహిస్తున్న సామాజిక తనిఖీల్లో వెల్లడవుతూనే ఉంది.

✦ గ్రామాల్లో నిర్వహించిన పనుల కొలతలు, రికార్డులు చేసేందుకు సాంకేతిక సహాయకుల మండలానికి ఒక్కరు ఉండాల్సి ఉండగా జిల్లా వ్యాప్తంగా కేవలం ఏడుగురు మాత్రమే ఉండగా, ఏపీవోలు కూడా బీర్‌పూర్, సారంగాపూర్, బుగ్గారం, జగిత్యాల అర్బన్, మేడిపల్లి మండలాల్లో ఖాళీ ఉన్నాయి.

✦ గ్రామాల్లో పనులు పర్యవేక్షించే సాంకేతిక సహాయకులు జిల్లా వ్యాప్తంగా 54 మందికి గానూ ప్రస్తుతం 31 మంది పనిచేస్తున్నారు.

✦ పలు మండలాల్లో సాంకేతిక సహాయకులు, ఏపీవోలు ఖాళీలు ఉండటంతో వీరికే అదనపు బాధ్యతలు అప్పగించారు.

✦ ప్రభుత్వం తండాలను పంచాయతీలుగా మార్చడంతో నూతనంగా ఏర్పాటైన వాటికి క్షేత్ర సహాయకుల నియామకాలు చేపట్టకపోవడంతో పాత వారితోనే సర్దుకు పోవాల్సి వస్తోంది. ఇప్పటికే ఉన్న ఆయా గ్రామాల్లో పూర్తి స్థాయిలో లేకపోగా, నూతన పంచాయతీలకు మరింత ఇబ్బందిగా మారింది.

✦ 380 పంచాయతీలకు గానూ ప్రస్తుతం 242 మంది మాత్రమే క్షేత్ర సహాయకులు కొనసాగుతున్నారు.

✦ పంచాయతీలు విడిపోయి ఏళ్లు గడుస్తున్నా పాత పంచాయతీల నుంచే పనులు కల్పించడం, వేర్వేరు ప్రాంతాల్లో కూలీలు పనులకు వెళ్లడంతో ప్రతి కూలీ హాజరు పనుల వద్దకు క్షేత్ర సహాయకులు వెళ్లి నమోదు చేయడం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

✦ పర్యవేక్షణ కొరవడటంతో కొలతల్లో తేడాలు, గతంలో చేపట్టిన పనుల్లో మళ్లీ చేస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పల్లెల్లో అందని సామగ్రి

ఉపాధి హామీ పనులకు వచ్చిన కూలీలకు పనుల వద్ద వసతులతోపాటు అన్ని రకాలుగా భద్రత కల్పించాల్సి ఉంటుంది. కొన్నేళ్లుగా సామగ్రి పంపిణీ చేయకపోగా కూలీలకు నీడ వసతికోసం గ్రామానికి రెండు, మూడు కవర్లు అందించేవారు. వాటిని కూడా నిలిపివేయడంతో చెట్ల నీడకు సేద తీరాల్సిన పరిస్థితి. సీజన్‌లో ఒక్కో సారి గ్రామంలో కనీసం 100 నుంచి 200లకు పైగా కూలీలు పనులకు వెళ్తుంటారు. గతంలో ఉపాధి హామీ పథకం కూలీలకు వచ్చే వారికి గడ్డపార, పారలను అందించేవారు. 2014 నుంచి వాటిని అందించడం లేదు. దీంతో కూలీలు వాటిని కొనుగోలు చేసుకొని పనులకు వెళ్లాల్సి వస్తోంది. రూ.కోట్లలో నిధులు వ్యయం చేస్తున్నా.. పరికరాలు అందించకపోవడం పట్ల కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పనుల వద్ద మెడికల్ కిట్ ఉంచాల్సి ఉండగా సరఫరా లేకపోవడంతో అందుబాటులో ఉన్న ఆశా కార్యకర్తల వద్ద నుంచి తీసుకోవాల్సి వస్తోంది. ప్రమాదాలకు గురైన కూలీలకు ప్రభుత్వం పరిహారం అందిస్తుండగా వాటిపై అవగాహన లేకపోవడంతో సరిగా అందడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

కొత్త ఉపాధ్యాయులకు పోస్టింగులు

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లాలో డీఎస్సీ ద్వారా ఎంపికైన 272 మంది కొత్త ఉపాధ్యాయులకు మంగళవారం పోస్టింగులు ఇచ్చారు. జిల్లాలో ఖాళీల వివరాలు ప్రకటించి టీచర్స్ భవన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.గౌతంరెడ్డి, జిల్లా విద్యాధికారి డాక్టర్ బి.జగన్మోహన్‌రెడ్డిలు, ఎంపికైన ఉపాధ్యాయుల నియామకపత్రాలను పరిశీలించి ఖాళీల సబ్జెక్టు.. కోరుకున్న పాఠశాలల్లో పోస్టింగులు ఇచ్చారు. పోస్టింగులు పొందిన వారిలో 100 మంది స్కూల్ అసిస్టెంట్లు, 134 మంది ఎస్జీటీలు, 31 మంది భాషా పండితులు, ఏడుగురు పీఈటీలున్నారు. కౌన్సెలింగ్ ఉదయం 10 గంటలకే ఉంటుందని ప్రకటించడంతో ఎంపికైన అభ్యర్థులు టీచర్స్ భవన్‌కు చేరుకున్నారు. ప్రభుత్వం నుంచి డాటా రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ప్రకటించడంతో తిరిగి వెళ్లారు. మళ్లీ కొద్ది సేపటికే కౌన్సెలింగ్ ఉంటుందని ప్రకటించడంతో కాకుండా ఎంపికైన ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. మధ్యాహ్నం నుంచి కౌన్సెలింగ్ చేపట్టగా.. రాత్రి వరకు కొనసాగింది.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్, డీఈవో

అందమైన బొమ్మ.. రంగుల బతుకమ్మ



మెట్‌పల్లిలో సద్దుల బతుకమ్మ సంబరాలు మంగళవారం తెల్లవారు జాము వరకు కొనసాగాయి. మొన్నటి వరకు నీటితో బోసినట్లు కనిపించిన బతుకమ్మ ఘాట్.. ప్రస్తుతం ఇలా రంగురంగుల పూల బతుకమ్మలతో అందరిని ఆకట్టుకుంటోంది. **- న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం**

18న జిల్లాస్థాయి సైన్స్ సెమినార్

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ ఈ నెల 18న జగిత్యాల టీచర్స్ భవన్‌లో జరుగుతుందని డీఈవో జగన్మోహన్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్‌లు ఓ ప్రకటనలో తెలిపారు. 8 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 5 ప్రకారాల పోటీలో పాల్గొనవచ్చని ఒక్కో పాఠశాల నుంచి ఒక విద్యార్థికి అవకాశముంటుందన్నారు. జిల్లాస్థాయి సెమినార్‌లో మొదటి స్థానం పొందిన వారికి ఈ నెల 29న జరిగే రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపిక చేస్తామని అందులో ఎంపికైన వారు నవంబర్ 20న ముంబైలో జరిగే జాతీయ స్థాయి సెమినార్‌కు ఎంపికవుతారని ఆయన పేర్కొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ బదిలీ

జగిత్యాల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మంగళవారం పలువురు సబ్ రిజిస్ట్రార్లను బదిలీ చేసింది. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరున్నారు. మెట్‌పల్లి సబ్ రిజిస్ట్రార్ ఎం.డి.అసిఫొద్దీన్‌ను షేర్‌లింగంపల్లికి. . రామగుండం సబ్ రిజిస్ట్రార్ ఎం.బాలకిషన్‌ను గండిపేటకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశించారు. మెట్‌పల్లి పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో నేరాల వివరాలు, దరఖాస్తులు, కేసుల ప్రగతికి సంబంధించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని సీఐ నిరంజన్‌రెడ్డికి సూచించారు. రౌడీషీటర్లపై నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన పెంపొందించాలని చెప్పారు. అనంతరం పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఆవరణలో మొక్క నాటారు. డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సైలు చిరంజీవి, రాజు ఉన్నారు.



మెట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో కేసుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కోతుల బాధ ఇంతింత కాదయా..

జిల్లాలో కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోకి దూరి తినుపదార్థాలు ఎత్తుకుపోతుండగా, పంట పొలాల్లో కూడా తీవ్ర నష్టం చేస్తున్నాయి. మంగళవారం మల్యాల మండలం రామన్నపేట గ్రామ శివారులోని వరద కాలువ పక్కన కొందరు ధాన్యం ఆరబెట్టుకోగా కొన్ని మర్కటాలు ధాన్యంలో తిష్టవేసి వాటిని కూడా తినడంతో రైతులు విస్మయం వ్యక్తం చేశారు. వాటిని తరమడానికి ప్రయత్నిస్తే దాడిచేయడానికి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ అధికారులు వాటిని పట్టించి సుదూర ప్రాంతంలోని దట్టమైన అడవిలో వదిలిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, రామన్నపేట (మల్యాల)



రామన్నపేట వరద కాలువ పక్కన ధాన్యం తింటున్న కోతులు

నకిలీ ధ్రువపత్రం జారీపై విచారణ

తండ్రి బతికుండగానే చనిపోయినట్లు పేర్కొన్న కుమారుడు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ఓనర్‌షిప్ ధ్రువపత్రం జారీ చేయకుండానే నకిలీ ధ్రువపత్రాన్ని సృష్టించి బ్యాంకులో రుణం తీసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన సున్నం పెద్దముత్తన్నకు ఇల్లు ఉంది. అతడి కుమారుడు రవి తన తండ్రి 30 ఏళ్ల క్రితమే మరణించారని పేర్కొంటూ తన పేరు మీద ఓనర్‌షిప్ సర్టిఫికెట్ తీసుకున్నారు. తండ్రి పేరు మీద ఉన్న ఇంటిని తన పేరు మీదకు రిజిస్ట్రేషన్ చేయించుకొని మెట్‌పల్లిలోని ఓ బ్యాంకులో రూ.3 లక్షల రుణం తీసుకున్నాడు. ఇటీవల రవి మృతిచెందగా.. బ్యాంకు అధికారులు అతడి ఇంటికి వచ్చి రుణ విషయం తెలిపారు. దీంతో పెద్దముత్తన్న 'తాను బతికే ఉన్నప్పటికీ గ్రామ పంచాయతీ నుంచి డెత్ సర్టిఫికెట్ ఇచ్చార'ని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల ప్రకారం గ్రామ పంచాయతీలో ఎంపీడీవో చంద్రశేఖర్ మంగళవారం విచారణ చేపట్టారు. ఇబ్రహీంపట్నం గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి డెత్ సర్టిఫికెట్ జారీ చేయలేదు కానీ.. పంచాయతీ స్టాంప్, కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి.. నకిలీ ఓనర్‌షిప్ సర్టిఫికెట్‌ను సృష్టించినట్లు ఎంపీడీవో తెలిపారు. పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, బాధితుడి వాంగ్మూలాలను తీసుకొని.. సంబంధిత నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆయన తెలిపారు.

అంజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు అంజన్న ఆలయం మంగళవారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. వందలాది వాహనాల్లో వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ముగిసిన సెలవులు.. కిక్కిరిసిన బస్సులు



దసరా, బతుకమ్మ పండగల సెలవులు పూర్తికావడంతో ఆయా ప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రయాణ కూడళ్లు మంగళవారం కిక్కిరిసిపోయాయి. మెట్‌పల్లి నుంచి హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు ప్రయాణికుల సౌకర్యార్థం సూపర్ లగ్జరీలతోపాటు ఎక్స్‌ప్రెస్ బస్సులను అదనంగా నడిపించామని మెట్‌పల్లి బస్ డిపో మేనేజర్ దేవరాజ్ తెలిపారు. అయినా బస్సులు సరిపోక జనం సీట్ల కోసం ఎగబడ్డారు.

- న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

ఉన్నత చదువుకు బకాయిల భారం



- పెండింగ్‌లో రూ.120 కోట్ల ఆర్టీఎఫ్ నిధులు
- ప్రైవేటు కళాశాలలు మూసి యాజమాన్యాల నిరసన

పేద పిల్లలు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సమకూరుస్తున్న ఆర్థిక సాయం నిలిచిపోయింది.. విద్యాసంవత్సరం సగం మేర పూర్తయినా బకాయిలు రాకపోవడంతో యాజమాన్యాలు కళాశాలలు మూసి నిరసన తెలుపుతుండగా, ప్రభుత్వ నిర్లక్ష్యం తమ భవిష్యత్తుకు ప్రతిబంధకంగా మారిందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు..

ఈనాడు, కరీంనగర్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడేళ్లుగా ప్రైవేటు డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల ఖాతాలకు చేరాల్సిన ఆర్టీఎఫ్(రీయింబర్స్‌మెంట్ ట్యూషన్ ఫీ) నిధులు పేరుకుపోయాయి. నిర్వహణ భారంగా మారిందని యాజమాన్యాలు కళాశాలలు మూసి నిరసన తెలుపుతుండటంతో దసరా సెలవుల తరువాత విద్యార్థులు ఇళ్ల వద్దే ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

- నాలుగు జిల్లాల పరిధిలో 64 డిగ్రీ, 35 పీజీ కళాశాలలతో పాటు 8 ఇంజినీరింగ్, 15 వరకు ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలున్నాయి. అన్ని చోట్లా కలిపి దాదాపు 42 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.
- డిగ్రీ స్థాయిలో రూ.20 వేలు, ఇంజినీరింగ్ తదితర కోర్సులకు రూ.27 వేల వరకు ప్రభుత్వం ఆర్టీఎఫ్‌ను చెల్లిస్తోంది.
- కొన్ని కోర్సులు మినహాయించి దాదాపు డిగ్రీ విద్యార్థుల ఫీజు మొత్తం రీయింబర్స్‌మెంట్ ద్వారానే యాజమాన్యాలకు అందుతోంది.
- దాదాపు 95 శాతం మంది విద్యార్థులు ప్రభుత్వం చెల్లించే రుసుంతోనే చదువు పూర్తి చేస్తున్నారు.

మూడేళ్లుగా చెల్లింపులు లేక నాలుగు జిల్లాల్లో కలిపి రూ.120 కోట్ల వరకు బకాయిలున్నాయి.

- 2021-22కు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో 30 శాతం, 2022-23కు సంబంధించి 90 శాతం బకాయిలున్నాయి. గత విద్యా సంవత్సరం(2023-24)లో ఒక్క పైసా విడుదల కాలేదు.
- ప్రస్తుత విద్యా సంవత్సరం విషయంలో అతిగతీ లేకపోగా తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టీపీడీపీఎంఏ) ఆధ్వర్యంలో పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించారు.
- స్పందన లేకపోవడంతో శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రైవేటు కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఎస్‌యూపీఎంఏ) ఆధ్వర్యంలో బంద్ నోటీసు అందించారు. రెండు రోజులుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి.



జమ్మికుంట చాణక్య డిగ్రీ, పీజీ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఉపకార వేతనాలదీ అదే పరిస్థితి

కొన్ని కోర్సులకు సంబంధించి విద్యార్థులు ఆర్టీఎఫ్ పోగా మిగతా ఫీజును చెల్లిస్తామనే ఒప్పందంతో కళాశాలల్లో చేరుతున్నారు. ఉపకార వేతనాలు మంజూరైతే మిగతా ఫీజును చెల్లిద్దామనుకున్నా రెండేళ్లుగా ఎంటీఎఫ్ (మెయింటెనెన్స్ ఫీ టు స్టూడెంట్) సక్రమంగా అందడం లేదు. చదువు పూర్తయినా ప్రభుత్వం నుంచి కళాశాల యాజమాన్యాలకు ఆర్టీఎఫ్ రాకపోవడంతో టీసీ, మార్కుల జాబితా తదితర ధ్రువపత్రాలు తీసుకునే సమయంలో విద్యార్థులు ఫీజు చెల్లించాల్సి వస్తోంది. చాలా కళాశాలల్లో డిగ్రీ విద్యార్థులు ఉపకార వేతనం మొత్తాన్ని కళాశాలకు చెందిన ప్రైవేటు బస్సు రవాణాకు ఉపయోగిస్తున్నారు. అది కూడా రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో కళాశాలలో ఆర్టీఎఫ్ బకాయిలు తృతీయ సంవత్సరం వరకు అలాగే కొనసాగుతున్నాయి.

తరగతులు నష్టపోతున్నాం



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాలేదని కళాశాలలు మూసివేయడంతో మేం నష్టపోవాల్సి వస్తోంది. ఉపకార వేతనాలు వస్తే అవసరమైన విద్యా సామగ్రిని కొనుక్కునే వాళ్లం. నాకు గతేడాదితో పాటు ఈ సంవత్సరానికి చెందిన ఉపకార వేతనం అందలేదు.

-బి.నవ్యశ్రీ, బీకాం ద్వితీయ సంవత్సరం, కరీంనగర్

వేతనాలు చెల్లించలేకపోతున్నాం



కొన్నేళ్లుగా బకాయిలు రాక కళాశాలలు నడపలేని పరిస్థితిలో ఉన్నాం. సిబ్బందికి వేతనాలు సహా నిర్వహణ తలకు మించిన భారంగా మారింది. అప్పు చేసి తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం బకాయిలను సత్వరమే చెల్లించి విద్యా ప్రగతికి తోడ్పాటునందించాలి.

-శ్రీపాద నరేశ్, కార్యదర్శి, ఎస్‌యూపీఎంఏ, జగిత్యాల

శ్రీరామసాగర్‌కు 8 వేల క్యూసెక్కుల వరద

జగిత్యాల ధరూర్ క్యాంపు: శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం సాయంత్రం వరకు 8,507 క్యూసెక్కుల వరదనీరు వచ్చిచేరుతోంది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ, విద్యుత్తు ఉత్పత్తికి 4,917 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150, సరస్వతి కాలువకు 500, వరద కాలువకు 2 వేలు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠ సామర్థ్యం మేరకు 80.501 టీఎంసీల నీరు నిలువ ఉంది. ఈ వానాకాలంలో జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ఎస్సారెస్పీలోకి 247.070 టీఎంసీల వరదనీరు రాగా 173.970 టీఎంసీల నీటిని దిగువకు వదిలారు. గోదావరిలోకి 99 టీఎంసీల మిగులు జలాలను వదలగా కాకతీయ కాలువకు 27 టీఎంసీలు, వరద కాలువకు 33 టీఎంసీలు విడుదల చేశారు.

కల్తీ కబళిస్తోంది

నేడు ప్రపంచ ఆహార దినోత్సవం

ఆహార పదార్థాలు పండిన చోటు నుంచి లేదా తయారైన చోటు నుంచి వినియోగదారులకు చేరే క్రమంలో కొందరు స్వార్థపరుల వల్ల కల్తీకి గురవుతున్నాయి. పదార్థాలు ఆకర్షణీయంగా ఉండాలనో.. ఎక్కువకాలం నిలువుండాలనో.. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందాలనో ఇలా రకరకాల ప్రయోజనాలు ఆశించి అవసరం లేని రసాయనాలు వాడి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. అందుకే శరీరంలో ఏదో తెలియని నిస్సత్తువ. కొందరికి తింటే అరగటం లేదు. శుభ్రమైన నీరు.. నాణ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆహారం భద్రతపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

– న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం, కరీంనగర్ సాంస్కృతికం

వయసుల వారీగా వినియోగం (కాలరీల్లో)

2-3 ఏళ్ల మధ్య వారు	1000-1400
18 వయసులోపు వారు	2,400
19-20 మధ్య..	2,600
21-40 సంవత్సరాల వయసు వారికి	2400
41-60 మధ్య వయసు వారు	2200
61 ఏళ్లు పైబడిన వారు	2000


సిరిసిల్ల: శుభకార్యంలో మిగిలిన ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ వింధ్యారాణి

డబ్బులిచ్చీ జబ్బు పడాలా?

ఉదయం లేచినప్పటి నుంచి డబ్బిచ్చి సేవలు పొందుతున్నాం. ప్రతి సందర్భంలోనూ వినియోగదారులమే. మనకు కావాల్సిన వస్తువులు అమ్మేది, సేవల్ని అందించేది ప్రైవేటు వ్యక్తులు.. సంస్థలు.. ప్రభుత్వమైనా కావచ్చు.. చెల్లించిన సొమ్ముకు తగిన ప్రతిఫలం ఆశించడం వినియోగదారుల హక్కు. డబ్బిచ్చి అనారోగ్యం పాలవడం ఎంతవరకు సమంజసం. అవసరమైనప్పుడు హక్కు వినియోగించుకునే చైతన్యం ప్రతి ఒక్కరిలో ఉండాలని పౌరసమాజం కోరుకుంటోంది.

కనిపెట్టడం ఇలా..

● చిన్న సీసాలో కొద్దిగా పాలు తీసుకొని గిలకొట్టాలి. డిటర్జెంట్ లాంటివి కలిపితే నురగ ఎక్కువగా వస్తుంది.

● తెల్లని బ్లాటింగ్ పేపర్‌ని తడిపి కానీ తడి దూదితో కానీ కూరగాయలు, పండ్లూ తుడిస్తే కృత్రిమ రంగు ఉంటే తెలిసిపోతుంది.

● ఐస్ క్రీం కొంచెం విడిగా తీసి దాని మీద రెండు చుక్కల నిమ్మరసం పిండాలి. నురగలు వస్తే కల్తీ జరిగినట్లే.

● మిరియాలను ఆల్కహాలులో వేస్తే మునిగిపోతాయి. బొప్పాయి గింజలు కలిస్తే తేలుతాయి.

● పంచదార, ఉప్పుల్లో కల్తీ జరిగినట్లు అనుమానమొస్తే చెంచాడు తీసుకొని నీళ్లలో వేస్తే అవి కరిగిపోతాయి. కల్తీ ఉంటే చాక్ పొడి అడుగున పేరుకుంటుంది.

● కాస్త తేనెలో దూదిని ముంచి తీసి వెలిగిస్తే మండుతుంది. కల్తీ అయితే చిటపటలాడుతుంది.

● కరిగిన నెయ్యిలో ఒక స్పూన్ చక్కెర వేసి బాగా కలపాలి. ఐదు నిముషాల తర్వాత అది ఎరుపు రంగులోకి మారితే కల్తీ జరిగినట్లు.

● పసుపు కానీ పప్పు కానీ.. కొద్దిగా నీళ్లలో వేసి దాంట్లో కొన్ని చుక్కలు హైడ్రోక్లోరిక్ ఆసిడ్ వేయాలి. మెటానిల్ ఎల్లో కల్తీ జరిగితే నీరు ఊదారంగులోకి మారుతుంది. పసుపులో లెడ్ క్రోమైట్ కలిసినట్లయితే నీళ్లు మరీ ఎక్కువ పచ్చగా మారుతాయి. మంచి పసుపు నీళ్లలో కరగకుండా అడుగున చేరుకుంటుంది.

ఎలా చేస్తారంటే..



పాలు, పాల ఉత్పత్తులు: తరచుగా కల్తీకి గురయ్యేవి నిత్యం వాడే పాలు. అందులో ఏ నీళ్లు పడితే ఆ నీళ్లు కలిపితే అనారోగ్యం తప్పదు. పాల రంగూ, చిక్కదనం కోసం చాక్ పౌడర్, యూరియా, కాస్టిక్ సోడా, హైడ్రోజన్ పెరాక్సైడ్ లాంటివి కలుపడం వల్ల జీర్ణ సంబంధ సమస్యలు, పిల్లల్లో హార్మోన్ల సమస్యలు వస్తాయి.



పప్పులు: ఆకర్షణీయంగా కన్పించేందుకు మెటానిల్ ఎల్లో కలర్ కలుపుతారు. ఇది కలిపిన ఆహారపదార్థాలు తింటే న్యూరోటాక్సిసిటీ అనే సమస్యతో నాడీ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది.



మసాల దినుసులు: మిరియాల్లో బొప్పాయి గింజలు, పసుపులో మెటానిల్ ఎల్లో, రెడ్ ఆక్సైడ్, ఇంగువలో మట్టి, కారంలో ఇటుక పొడి కలుపుతారు. ఖరీదైన కుంకుమ పువ్వులో మొక్కజొన్న పీచును కలుపుతారు.



కూరగాయలు, పండ్లు: కాపు ఎక్కువగా వచ్చేందుకు, పురుగు పట్టకుండా ఉండేందుకు ఎన్నో రసాయన మందులు వినియోగిస్తున్నారు. ఆకర్షణీయంగా కనిపించడానికి రసాయన రంగుల్ని ఇంజెక్ట్ చేస్తారు. ఆకుపచ్చని కూరలు మరింత పచ్చగా తాజాగా కనిపించేందుకు మాలకైట్ గ్రీన్ అనే రసాయన రంగు క్యాన్సర్ కారకం కూడా. ఇంకా ఆక్సిటోసిన్, శాకరిన్, వ్యాక్స్, కాపర్ సల్ఫేట్ వంటివి వాడుతున్నారు.

ఇదీ నేపథ్యం..

1945లో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ స్థాపనకు గుర్తింపుగా ఏటా అక్టోబర్ 16న ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 'మంచి భవిష్యత్తు కోసం ఆహారం అందించడమే లక్ష్యం' అనే థీమ్‌ను ఈ ఏడాది తీసుకున్నారు.

వృథా వద్దు..

✦ జనాభాకు అనుగుణంగా అవసరమైన ధాన్యంతోపాటు ఇతరత్రా ఆహార పదార్థాలు సరిపోవడం లేదు. శుభకార్యాల సందర్భంగా మిగిలిన ఆహారం వృథాగా పాడేస్తున్నారు. అవే పదార్థాలను అనాథలకు, పేదలకు అందాలనే సంకల్పంతో కొందరు స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమం 9949 914242కు ఫోన్ చేస్తే వారే వ్యాన్ లేదా ఆటోలో వచ్చి ఆహారం తీసుకొని వెళ్తారు.

✦ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ దంపతులు ఆరేళ్లుగా శుభకార్యాల్లో మిగిలిన ఆహారాన్ని స్లమ్ ఏరియాలోని కుటుంబాలకు అందిస్తున్నారు. 93945 05101కు ఫోన్ చేస్తే వారే అద్దె ఆటోలో తీసుకెళ్లి పేదలకు అందిస్తున్నారు.

రంగులు కలిపితే సమస్యలు తప్పవు

- సాయి ప్రియ, న్యూట్రీషియనిస్ట్, కరీంనగర్



ఆహార పదార్థాల్లో రసాయన రంగులు కలపడం వల్ల క్యాన్సర్, రక్తహీనత సమస్యలు తలెత్తుతాయి. జంక్ ఫుడ్, మంచూరియా, చిల్లీ పౌడర్, ఆయిల్స్, రెడీ ఈట్ ఫుడ్‌లో ఇవి ఎక్కువగా కలిసే అవకాశం. ప్యాకెట్ ఫుడ్‌లో ఏయే పదార్థాలు కలిపారో చూసుకొని తినాలి. ఎక్కువగా కొబ్బరి, ఇతరాత్ర చెట్ల పాలు తాగడం మంచిది. సహజంగా దొరికే ఆకు కూరలు, కూరగాయలు తీసుకోవాలి.


జమ్మికుంట మార్కెట్‌లో పత్తి బిడ్డింగ్

స్వల్పంగా తగ్గిన పత్తి ధర

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పత్తి ధర స్వల్పంగా తగ్గింది. యార్డుకు 30 ట్రాలీల కొత్త విడి పత్తిని రైతులు విక్రయానికి తీసుకురాగా బిడ్డింగ్‌లో కనిష్ఠ ధర రూ.6200, గరిష్ఠ ధర రూ.6900 పలికింది. 10 క్వింటాళ్ల బస్తాల పత్తిని విక్రయానికి తేగా రూ.6,100 నుంచి రూ.6,500 వరకు పలికింది. మొత్తంగా ధర సోమవారం కంటే రూ.60 మేర తగ్గింది. బిడ్డింగ్‌ను మార్కెట్ కార్యదర్శి రాజా పరిశీలించారు. తేమ శాతం అధికంగా ఉండం వల్లే ధర తగ్గిందని అధికారులు చెబుతున్నారు.

జగిత్యాల బీటుకు అధికంగా మక్కలు

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు మంగళవారం 724 క్వింటాళ్ల మక్కలను విక్రయానికి తెచ్చారు. బీటులో మక్కలకు క్వింటాకు కనిష్ఠంగా రూ.1,805 నుంచి గరిష్ఠంగా రూ.1,950 వరకు ధర పలికిందని మార్కెట్ కార్యదర్శి టి.రాజశేఖర్ తెలిపారు. ఎంటీయూ- 1010 దొడ్డురకం ధాన్యానికి సగటున రూ.1,870 చొప్పున ధర లభించినట్లు పేర్కొన్నారు.

అగ్నిమాపక శాఖ సిబ్బందికి నైపుణ్య శిక్షణ


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే : కరీంనగర్ మానేరు జలాశయంలో రెండు రోజులపాటు నిర్వహించే అగ్నిమాపక శాఖ జోనల్ స్థాయి నైపుణ్య శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి హాజరైన 70 మంది సిబ్బందికి శిక్షణ అందించారు. కొత్తగా కొనుగోలు చేసిన రిమోట్ కంట్రోల్ లైఫ్ సేవింగ్ బోట్‌పై శిక్షణ, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బుధవారం కరీంనగర్, నిర్మల్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, ఆసిఫాబాద్ జిల్లాల 60 మంది సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా అధికారి భగవాన్‌రెడ్డి పర్యవేక్షించారు.

అండర్-23 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు 18న

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: అండర్-23 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొనే కరీంనగర్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈనెల 18న కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ మైదానం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి ఎన్.మురళీధర్‌రావు ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారుల్లో 60 మందిని ఎంపిక చేసి, 15 మంది చొప్పున నాలుగు జట్లుగా విభజించి మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు. ఇందులో నుంచి తుది జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఈ జట్టు నవంబర్ నెల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్, వరంగల్ జిల్లాల్లో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటుందన్నారు. క్రీడాకారులు సొంత కిట్టు, యూనిఫాం, 10వ తరగతి మెమో, జనన ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో ఈనెల 17న సాయంత్రం 5 గంటల వరకు కేడీసీఏ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులు 2001 సెప్టెంబరు 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. ఎంపిక మ్యాచ్‌లకు కేడీసీఏ ఉపాధ్యక్షులు కె.మహేందర్‌గౌడ్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని, ఉపాధ్యక్షుడు పి.మనోహర్‌రావు సభ్యుడు అజిత్‌కుమార్‌లు మ్యాచ్‌లను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

క్రికెట్‌లో మెరుపులు

● బ్యాట్ పడితే సిక్స్.. బంతి విసిరితే బోల్డ్
● రాణిస్తున్న ఉమ్మడి జిల్లా అండర్-19 క్రీడాకారులు

న్యూస్‌టుడే
కరీంనగర్ క్రీడా విభాగం

బ్యాట్ పట్టి క్రీజ్‌లోకి వెళ్తే వచ్చిన బంతి సిక్స్ వెళ్లాల్సిందే.. ప్రత్యర్థి ఎవరైనా బంతి విసిరితే క్లీన్ బౌల్డ్ కావడం తథ్యం.. వెరసి ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు కప్పు కొట్టడం ఖాయం.. ఉమ్మడి జిల్లా క్రికెట్ క్రీడాకారులు తమదైన ప్రతిభతో ముందుకు సాగుతూ క్రికెట్ అభిమానుల అభినందనలు అందుకుంటున్నారు. ఇటీవల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలో జరిగిన అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచి ట్రోఫీని అందుకున్నారు. ప్రతిభ చాటుతున్న ఉమ్మడి జిల్లా క్రీడాకారులతో 'న్యూస్‌టుడే' కథనం.



11 ఏళ్లుగా ఆడుతూ..

కరీంనగర్‌కు చెందిన ధర్మపురి ఆంజనేయులు, సంధ్యారాణిల కుమారుడు సాత్విక్ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 11 ఏళ్లుగా క్రికెట్ సాధన చేస్తున్నాడు. తల్లి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, తండ్రి పోలీసు శాఖలో ఉద్యోగం చూస్తూ కుమారుడికి క్రికెట్‌పై ఉన్న ఆసక్తిని గుర్తించి కోచింగ్ ఇప్పిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో సాత్విక్ సుమారు 150 మ్యాచ్‌ల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లు, సిరీస్‌లు అందుకున్నాడు. ఇటీవల జరిగిన అండర్-19 రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. భారత జట్టు జెర్సీని వేసుకుని ఆడినప్పుడే తనకు అసలైన ఆనందం ఉంటుందని సాత్విక్ చెబుతున్నాడు.



మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌తో ప్రశంసలు..

మెట్టుపల్లికి చెందిన నగేష్ భీమ్నాథ్-పద్మావతిల కుమారుడు విఘ్నేష్‌కు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టం. నాలుగేళ్ల నుంచి మెట్‌పల్లి నుంచి కరీంనగర్‌కు వచ్చి క్రికెట్ సాధన చేస్తున్నాడు. ఇటీవల వరంగల్‌లో జరిగిన అండర్-19 టోర్నమెంట్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లు, మ్యాన్ ఆఫ్ ది సిరిస్‌గా నిలిచి అతిథుల ప్రశంసలు అందుకున్నాడు. పాఠశాల, కళాశాల స్థాయిలో ఇప్పటి వరకు సుమారు 70 మ్యాచ్‌లు ఆడి ప్రతిభ చాటాడు. భారత జట్టుకు ఎంపికయ్యే వరకు నిత్యం సాధన చేస్తూనే ఉంటానని, మెట్‌పల్లి నుంచి కరీంనగర్‌కు వచ్చి సాధన చేయడం కష్టంగా ఉన్నా.. ఇష్టంగా చేస్తున్నానని విగ్నేష్ చెప్పాడు



బృంద నాయకుడిగా ముందుండి నడిపిస్తూ..

జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన ఎర్రోజు మోహనాచారి, స్వప్నల కుమారుడు తక్షిల్ కొడిమ్యాలకు చెందిన సీనియర్లను చూసి ఏడేళ్లుగా సాధన చేస్తున్నాడు. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో తనకు ఆటలపై ఆసక్తి ఉండటంతో క్రికెట్‌పై శిక్షణ ఇప్పిస్తున్నాడు. వరంగల్‌లో జరిగిన అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో కరీంనగర్ జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి ప్రతి మ్యాచ్‌లో సత్తా చాటి జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. 2022లో ఎస్‌జీఎఫ్ అండర్-17 క్రికెట్ జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. 2020లో హైదరాబాద్ అండర్-14 జట్టుకు ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు సుమారు 100 మ్యాచ్‌లు ఆడాడు. భారత జట్టుకు కెప్టెన్ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తక్షిల్ తెలిపాడు.



ఏకలవ్యుడిగా సాధన...

కరీంనగర్‌కు చెందిన పల్లె పరశురాములు, సునీతల కుమారుడు ఆదిత్య క్రికెట్‌ను ఆరాదిస్తాడు. భారత జట్టుకు ఎప్పుడు, ఎలాంటి మ్యాచ్ ఉన్నా టీవీ ముందు నుంచి కదలడు. చిన్నప్పటి నుంచి క్రికెట్‌పై ఇష్టంతో నాలుగేళ్ల నుంచి సాధన చేస్తున్నాడు. క్రికెట్‌లో భవిష్యత్తు ఉండదని ఎంత మంది చెప్పినా లెక్క చేయకుండా స్వయంగా సాధన చేస్తున్నాడు. సుమారు 23 జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటి మంచి గుర్తింపు సాధించాడు. క్రికెట్ ఆటపై ప్రావీణ్యం పెంచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని కోచ్‌గా ఎదిగి ఉన్నతమైన క్రికెటర్‌లను తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు.



పాతకక్షలతో యువకుడి హత్య


సాగర్

కోరుట్ల, న్యూస్‌టుడే: పాతకక్షలతో యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన కోరుట్ల పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అయిలాపూర్ ప్రాంతంలో నివసిస్తున్న బోయిని సాగర్ (కల్యాణ్) (32)కి కోరుట్ల పట్టణంలోని కొంత మందితో స్నేహం ఉండేది. గతంలో మద్యం తాగుతున్న క్రమంలో గొడవ జరగగా కక్ష పెంచుకున్నారు. ఆదివారం రాత్రి ప్రకాశం రోడ్‌లో సాగర్ మద్యం తాగుతుండగా.. కొందరు అక్కడి చేరుకొని గొడవకు దిగారు. స్థానికులు 100 నంబర్‌కు సమాచారం అందించగా పోలీసులు చేరుకొని అందరిని అక్కడి నుంచి పంపించేశారు. రాత్రి 11.30 ప్రాంతంలో మరోమారు గొడవకు దిగి సాగర్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో ఓ యువకుడు సాగర్ మెడపై దాడి చేసిన అనంతరం నిందితులందరూ పరారయ్యారు. సాగర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సీఐ సురేశ్‌బాబు, కోరుట్ల, కథలాపూర్ ఎస్సైలు శ్రీకాంత్, నవీన్‌కుమార్‌లు మృతదేహాన్ని పరిశీలించి హత్యకు గల కారణాలు తెలుసుకున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

20న జూనియర్ ఖోఖో జట్టు ఎంపిక పోటీలు

కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: ఈనెల 20న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్ ఖోఖో జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి వై.మహేందర్‌రావు తెలిపారు. క్రీడాకారులు 2006 నవంబరు 22 తరువాత పుట్టిన వారై ఉండాలన్నారు. 10వ తరగతి మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఉదయం 9.00 గంటలలోపు అంబేడ్కర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

జగిత్యాల డీఎస్పీకి అతి ఉత్కృష్ట పతకం

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల డీఎస్పీ దరిశెట్టి రఘుచందర్‌కు కేంద్ర ప్రభుత్వం అతి ఉత్కృష్ట పతకం ప్రకటించింది. మావోయిస్టు కార్యకలాపాలను ధైర్యంగా ఎదుర్కొన్నందుకు, పోలీసు శాఖలో విశేషమైన సేవలందించినందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన ఈ పతకానికి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయనను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

తండ్రిని చంపిన తనయుడికి జీవితఖైదు

జగిత్యాల, న్యూస్‌టుడే: తండ్రిని చంపిన తనయుడికి జగిత్యాల న్యాయస్థానం మంగళవారం జీవితఖైదు విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గొల్లపల్లి మండలం రాపల్లికి చెందిన గడుగు పోచయ్య, శాంతలకు నలుగురు కుమారులు. పోచయ్య కుమారులు చేసిన అప్పులు తీర్చడానికి కొంత భూమి విక్రయించేందుకు ఇతరులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇది నచ్చని చిన్న కుమారుడు ప్రభుదాస్.. తల్లిదండ్రులతో గొడవకు దిగాడు. 2008 నవంబర్ 23న తన తల్లి శాంతపైకి రాళ్లు విసరగా గాయపడ్డారు. విషయం తెలిసిన పోచయ్య ఇంటికి రాగా ప్రభుదాస్ కర్రతో దాడి జరిపి తీవ్రంగా గాయపర్చాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందారు. గొల్లపల్లి పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు పంపించారు. అప్పటి ఇన్‌స్పెక్టర్లు జి.మహేశ్‌బాబు, ఎం.రవీందర్‌రెడ్డి దర్యాప్తు చేసిన ఈ కేసులో కోర్టు విధుల అధికారులు జి.రాజునాయక్, ఎం.కిరణ్‌కుమార్, శ్రీధర్‌లు న్యాయస్థానానికి సాక్ష్యాధారాలు సమర్పించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ మల్లికార్జున్ వాదించగా నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడడానికి చొరవ చూపిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

విదేశీ కొలువు.. ఇలా సులువు

● టామ్‌కామ్ ఆధ్వర్యంలో నియామకాలు
● రేపు కరీంనగర్‌లో జాబ్ మేళా

ఈనాడు, సిరిసిల్ల

ఉమ్మడి జిల్లాలో స్థానిక ఏజెంట్‌ల చేతిలో మోసపోయి గల్ఫ్ దేశాల్లో చాలా జీవితాలు వెల్లదీస్తున్నారు. అక్కడ సరైనా పని.. తిండి లేక నరకం అనుభవిస్తున్నారు. విదేశాల్లో ఉండలేక.. స్వదేశాలకు రాలేక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే యువతకు తెలంగాణ విదేశీ మానవ వనరుల సంస్థ(టామ్‌కామ్) సువర్ణావకాశాలు కల్పిస్తోంది. జిల్లాల వారీగా ఉద్యోగ మేళాలను నిర్వహిస్తోంది. యూఏఈలో డెలివరీ బాయ్స్ నియామకాల కోసం ఈ నెల 17న కరీంనగర్‌లోని మున్సిపల్ కార్యాలయం పక్కనున్న ఓ హోటల్‌లో మేళా నిర్వహిస్తోంది. దీనికి 21 నుంచి 40 ఏళ్ల వయస్సు వారు అర్హులు.

వీరు పదో తరగతి మెమోతో పాటు పాస్‌పోర్టు, మూడేళ్ల క్రితం తీసిన డ్రైవింగ్ లైసెన్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో మేళాకు హాజరు కావాలి. నియామక ప్రక్రియ దాదాపు నెల రోజుల్లో పూర్తి చేసి. కేవలం మెడికల్ పరీక్షలకు డబ్బులు తీసుకొని విదేశాలకు పంపిస్తారు. ఉమ్మడి జిల్లావాసులు ఈ మేళాకు హాజరు కావచ్చు.

20 దేశాలకు విస్తరణ

టామ్‌కామ్ సంస్థ 2020 వరకు గల్ఫ్ దేశాలకు మాత్రమే నియామకాలు జరిపేది. తర్వాత జపాన్, యూరోపియన్, మిడిల్‌ఈస్ట్, కెనడా, ఆస్ట్రేలియా తదితర 20 దేశాలకు విస్తరించింది. నర్సింగ్, హోటల్, నిర్మాణ, డ్రైవింగ్ తదితర 15 రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. ఆయా దేశాల ప్రభుత్వాలతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ప్రకారం నియామకాలు చేపడుతోంది. జర్మనీలో నర్సింగ్ కోసం ఈ నెల 14న కామారెడ్డి, జగిత్యాల జిల్లాలో అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించింది. 300 మంది హాజరుకాగా అందులో మహిళలు, పురుషులు కలిపి 153 మంది ఎంపికయ్యారు.

భాషపై శిక్షణ

విదేశాలకు వెళ్లేవారికి హిందీ, ఆంగ్లంపైనే కాకుండా అక్కడి భాషపై అవగాహన ఉండాలి. ఇందుకు టామ్‌కామ్ ఆధ్వర్యంలో మన ప్రభుత్వమే ఆయా భాషలపై అభ్యర్థులకు ఉచిత శిక్షణిస్తుంది. ఒప్పందం చేసుకొని దేశాల భాషా శిక్షణకు అభ్యర్థులే ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

మెరుగైన వేతనాలు

విదేశాల్లో ఉద్యోగాలకు మెరుగైన వేతనాలు లభిస్తాయి. న్యాక్ సంస్థలో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి జర్మనీలో నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలున్నాయి. రాష్ట్రం నుంచి అక్టోబరు మొదటి వారంలో 32 మంది జర్మనీకి వెళ్లారు. వీరికి ఏడాది ట్రైనీలుగా నెలకు రూ.1లక్ష వరకు వేతనం ఉంటుంది. పని బాగుంటే అదే కంపెనీలో అవకాశం ఇస్తారు. అప్పుడు నెలకు 2.80 లక్షల జీతం అందిస్తారు.

● సిరిసిల్లకు చెందిన ఇమ్రాన్‌కు ఏజెంటు సూపర్ మార్కెట్‌లో పని ఉందని రూ.1.20 లక్షలు తీసుకుని మూడు నెలల క్రితం కంపెనీ వీసా పేరుతో దుబాయ్ పంపించాడు. తీరా అక్కడికి వెళ్లాక వేరే పనులు చెప్పడంతో ఇమ్రాన్ ఇబ్బందులు పడ్డాడు. స్వదేశానికి పంపాలని యాజమాన్యాన్ని కోరితే చిత్రహింసలకు గురిచేశారు. సామాజిక మాధ్యమాల్లో గోడు వెళ్లబోసుకోవడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అక్కడి ఎంబసీ అధికారులతో మాట్లాడి ఇమ్రాన్‌ను ఇక్కడికి రప్పించారు.

● జగిత్యాల జిల్లా సారంగపూర్‌కు చెందిన అజయ్ 14 నెలల క్రితం స్థానిక ఏజెంటుకు రూ.2.70 లక్షలు చెల్లించి ఇరాక్ వెళ్లాడు. అక్కడి ఏజెంటు పాస్‌పోర్టు తీసుకొని పని కల్పించలేదు. చేతిలో చిల్లి గవ్వ లేక పస్తులుంటున్నానంటూ తల్లిదండ్రులకు అజయ్ బాధపడుతూ వీడియో పంపించాడు. దీంతో వారు స్థానిక ఏజెంట్‌ను నిలదీయగా రూ.1 లక్ష తిరిగి ఇచ్చారు. పాస్‌పోర్టు లేక, వచ్చేందుకు డబ్బుల్లేక అజయ్ అక్కడే అవస్థలు పడుతున్నాడు.





టామ్‌కామ్ యాప్

యాప్‌లో ఉద్యోగాల సమాచారం

టామ్‌కామ్ వెబ్‌సైట్‌తోపాటు యాప్‌లోనూ అన్ని వివరాలు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు, నిరుద్యోగులు విద్యార్హతలు, అనుభవం తదితర వివరాలు నమోదు చేసుకోవాలి. దీంతో ఏఏ దేశాల్లో ఎలాంటి ఉద్యోగావకాశాలు ఉన్నాయనే సమాచారం అందులో ఉంటుంది. వెబ్‌సైట్, యాప్‌లోని సమాచారంతో జిల్లాల వారీగా జరిగే జాబ్‌మేళాలకు హాజరు కావచ్చని రాష్ట్ర టామ్‌కామ్ మేనేజర్ షబ్నం 'ఈనాడు'కు తెలిపారు.

ధర్మపురి, న్యూస్‌టుడే:

సమస్య : నక్కలపేట, కమలాపూర్ రెండు ఇందిరమ్మ కాలనీ చివరి ప్రాంతంలో చీకటితో సమస్యలను ఎదుర్కొంటున్నాం.

- రాజేష్, ఇందిరమ్మ కాలనీ వాసులు

సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

- బాలె గంగాధర్, పుర కమిషనర్, ధర్మపురి

నేడు కోజాగర పూర్ణిమ ఉత్సవాలు

ధర్మపురి, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం రాత్రి కోజాగర పూర్ణిమ ఉత్సవాలు జరుగుతాయని ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రి శేషప్ప కళావేదికపై స్థానిక కళాకారులతో భక్తి సంగీత కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. అనంతరం రాత్రి 12 గంటలకు పాలలో చంద్ర వీక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. దీనికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సు సరిగా నడపడం లేదని ఫిర్యాదు

సారంగాపూర్, న్యూస్‌టుడే: మండలంలోని బట్టపల్లి, పోతారం గ్రామాలకు ఆర్టీసీ బస్సును నడపాలంటూ పలువురు గ్రామస్థులు ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ఫిర్యాదు చేశారు. కేవలం ఉదయం, సాయంత్రం ఒకసారి మాత్రమే విద్యార్థుల కోసం నడిపిస్తూ.. మిగతా సమయాల్లో బస్సు నడపకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామానికి బస్సు నడపాలని అధికారులను అడిగితే అందుబాటులో బస్సులు లేవని నిర్లక్ష్యపు సమాధానం ఇస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రేమానందం, ఆదర్శ్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

కఠిన చట్టాలు తీసుకురావాలి

జగిత్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వైద్యులపై జరుగుతున్న దాడులను నియంత్రించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కఠినమైన చట్టాలు తీసుకురావాలని ఐఎంఏ జగిత్యాల పట్టణశాఖ అధ్యక్ష, కార్యదర్శులు, డాక్టర్ గూడూరి హేమంత్, డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కలకత్తాలో మహిళ వైద్యురాలిపై జరిగిన దాడి ఘటనను వ్యతిరేకిస్తూ అక్కడి వైద్యులు నిర్వహిస్తున్న నిరవధిక నిరాహార దీక్షకు మద్దతుగా మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వైద్యులపై దాడులకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేయాల్సిన అవసరం ఉందని సీనియర్ వైద్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సీనియర్ సభ్యులు బీమనాతిని శంకర్, మందాడి మోహన్‌రెడ్డి, కోశాధికారి సుధీర్‌కుమార్, ఒడ్నాల రజిత తదితరులు పాల్గొన్నారు.



గోడప్రతి ఆవిష్కరిస్తున్న వైద్యులు

భాజపాలో చేరిక

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: మెట్‌పల్లికి చెందిన ప్రముఖ వైద్యుడు ముత్యాల వెంకట్‌రెడ్డి భాజపాలో చేరారు. గతంలో లోక్‌సత్తా ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన అనంతరం భారాసలో చేరారు. మంగళవారం నిజామాబాద్‌లోని భాజపా కార్యాలయంలో ఎంపీ అర్వింద్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. డాక్టర్‌తో పాటు పలువురు నాయకులు బోతుకూరి రాజారెడ్డి, గోనెల రాజరెడ్డి, బద్దం గంగాధర్ పార్టీలో చేరారు. ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి చూసి భాజపాలో చేరినట్లు వైద్యుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జయంతి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. శాస్త్రవేత్తగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ప్రిన్సిపల్ ఆర్.వెంకటేశ్వర్లు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి జి.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. మెట్‌పల్లి మండలంలోని వెల్లుల్లలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. సహకార సంఘం మాజీ అధ్యక్షుడు మారు మురళీధర్‌రెడ్డి, జుంగుల మారుతి, నరేశ్, సంజీవ్, మహేశ్, రాజేశ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుల నివాళి

భారాస కార్యకర్త అరెస్టు!

రాయికల్, న్యూస్‌టుడే: రాయికల్ మండలం అల్లీపూర్‌కు చెందిన భారాస కార్యకర్త అనుమల్ల మహేశ్‌ను మంగళవారం హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిసింది. ఎంపీ రఘునందన్‌రావుపై సామాజిక మాధ్యమాల్లో అనుచితంగా పోస్టు చేసినందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆరుగురిపై కేసు నమోదు చేయగా అందులో మహేశ్ ఉన్నారు. పోలీసులు ఈ ఘటనపై పూర్తి విచారణ చేస్తున్నట్లు సమాచారం.

భక్తురాలికి చరవాణి అప్పగింత

మల్యాల, న్యూస్‌టుడే: పెగడపెల్లి మండలం రాములపల్లికి చెందిన పొట్ల కవిత తన పిల్లలతో కలిసి మంగళవారం కొండగట్టు అంజన్న దర్శనం కోసం వచ్చి ఆలయ పరిసరాల్లో చరవాణిని పోగొట్టుకున్నారు. గుడి ఆవరణలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రమేశ్‌కు ఆ చరవాణి దొరకడంతో పోలీసు ఔట్‌పోస్టులోని ఏఎస్సై శ్రీనివాస్‌కు అప్పగించారు. అనంతరం భక్తురాలు ఔట్‌పోస్టులో ఫిర్యాదు చేయగా విచారించి ఆమెకు చరవాణిని అప్పగించినట్లు ఏఎస్సై తెలిపారు.

అప్రమత్తతతో వ్యవహరించాలి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులు అప్రమత్తతతో వ్యవహరించాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. మెట్‌పల్లి మండలం చౌలమద్దిలో పంచాయతీ కార్మికులకు ప్రమాద బీమా పత్రాలను మంగళవారం ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు పని చేసే సమయంలో తప్పకుండా బూట్లు, గ్లౌజ్‌లు వినియోగించాలన్నారు. భద్రతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని చెప్పారు. కార్యదర్శి రవి, కారోబార్ వాసాల రాములు, సిబ్బంది ఉన్నారు.

రసాయనశాస్త్ర పరిశోధన పుస్తకావిష్కరణ

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: జగిత్యాలలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సహాయ అధ్యాపకురాలు డాక్టర్ నీలి వాసవి రచించిన పరిశోధన పుస్తకాన్ని ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామకృష్ణ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. చంద్రయ్య, ప్రమోద్‌కుమార్, వరప్రసాద్, రాంచంద్రం, నీరజ, సుజాత, రహీం, శ్రీలత, జమున, సునీత, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం

కొడిమ్యాల, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని కొడిమ్యాల ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రిన్సిపల్ లావణ్య, మండల వైద్యాధికారి పరమేశ్వరి, సీహెచ్‌వో రాజశేఖర్, పర్యావేక్షకురాలు వెంకటనర్సమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వికటించిన టీకా!

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల బీరయ్యగుడి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మూడునెలల క్రితం జల అనే మహిళ తన మూడునెలల పాపకు టీకా ఇప్పించారు. టీకా వేసిన ప్రదేశంలో ఇన్‌ఫెక్షన్ తగ్గకపోవడంతో పాప అనారోగ్యానికి గురవుతోంది. ఫోన్‌లో మాట్లాడుతూ నిర్లక్ష్యంగా టీకా వేయడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని పాప తల్లి ఆరోపిస్తున్నారు. దీనిపై వైద్యాధికారులను సంప్రదించగా.. ఈ విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు.

ఆసుపత్రి అద్దాలు ధ్వంసం

ధర్మపురి గ్రామీణం, న్యూస్‌టుడే: నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మంగళవారం పలువురు ఆకతాయిలు ఆసుపత్రి అద్దాలు ధ్వంసం చేశారు. సాయంత్రం ఆసుపత్రి ఎదుట మద్యం సేవిస్తూ కిటికీ అద్దాలు పగలగొట్టారు. స్థానికులు వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లడంతో.. సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేస్తున్నారు.



ధ్వంసమైన ఆస్పత్రి కిటికీ అద్దాలు

నదీ తీరం.. అసౌకర్యాలకు నిలయం



జిల్లా సరిహద్దున గల రాయపట్నం గోదావరిలో స్నానాలు చేసేందుకు కరీంనగర్, చొప్పదండి, ధర్మారం, వెల్గటూర్‌తోపాటు మంచిర్యాల తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తుంటారు. అయితే స్నానాలు చేసే చోట అపరిశుభ్రమైన వాతావరణం నెలకొంది. ఇటీవల గణపతి విగ్రహాలు నిమజ్జనం చేశారు. వీటిని తొలగించకపోవడంతో ఇంకా నది తీరంలోనే ఉన్నాయి. ఎక్కడి చెత్త అక్కడే పేరుకునిపోయి దుర్గంధ వాతావరణం ఏర్పడింది. శుభ్రపరచడంతోపాటు నదికి చేరే రహదారిని మరమ్మతు చేయాలని భక్తులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ధర్మపురి**

ఘాట్‌రోడ్డుపై వంగిన బారికేడు

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టుపైన 'వై' జంక్షను సమీపంలోని ఘాట్‌రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన ఇనుప బారికేడు వంగిపోయింది. ప్రమాదాల నివారణ కోసం ఘాట్‌రోడ్డు పైనుంచి ఆలయానికి భారీ వాహనాలు వెళ్లకుండా దాదాపు అయిదేళ్ల క్రితం అధికారులు ఘాట్‌రోడ్డు దిగువ, 'వై' జంక్షను సమీపంలో ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశారు. కొందరు వాహన డ్రైవర్లు వాటిని ఢీకొనడంతో బారికేడ్లు వంగిపోయాయి. అధికారులు పటిష్ఠమైన బారికేడ్లను అమర్చాలని భక్తులు కోరుతున్నారు.



వంగిపోయిన ఇనుప బారికేడు

ఆలయంపై దాడిని ఖండిస్తూ ర్యాలీ

ధర్మపురి, న్యూస్‌టుడే: హైదారాబాద్‌లోని ముత్యాల పోశమ్మ ఆలయంపై దాడిని ఖండిస్తూ.. పట్టణంలో మంగళవారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. శివాజీ విగ్రహ కూడలి నుంచి పోలీసుస్టేషన్‌కి ర్యాలీగా వెళ్లి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు.

కోరుట్ల: చౌరబడి అమ్మవారి విగ్రహాన్ని, మంటపాన్ని ధ్వసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సనాతన ధర్మ పరిరక్షణ హిందూ ఐక్యవేదిక సభ్యులు మంగళవారం కోరుట్ల ఎస్సై శ్రీకాంత్‌కు వినతిపత్రం సమర్పించారు.

మల్లాపూర్: అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ చిట్టాపూర్, కుస్తాపూర్ గ్రామాల్లో గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా దుశ్చర్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. సహకార సంఘం ఛైర్మన్ మోహన్‌రెడ్డి, సామాజికవేత్త విష్ణువర్ధన్‌రాజు, శేఖర్, అంజిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్యవేదిక సభ్యులు

ఆలయాభివృద్ధికి ఆర్థిక సాయం

కొడిమ్యాల, న్యూస్‌టుడే: కొడిమ్యాల మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామివారి ఆలయానికి స్టీలు రెయిలింగ్ వేయించడానికి కొడిమ్యాలకు చెందిన ప్రవాస భారతీయుడు గుర్రం సురేశ్-సువర్ణ దంపతులు, తల్లి ఈశ్వరి, కుమారుడు అక్షయ్, కుమార్తె దివ్య కుటుంబ సభ్యులు రూ.3.50 లక్షల ఆర్థిక సహకారాన్ని అందించారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టులో ప్రత్యేక పూజలు

మల్యాల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజాపద్దుల (పబ్లిక్ అకౌంట్స్) కమిటీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంలు మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో రామకృష్ణారావు, అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత ఈవో ఎమ్మెల్యేలను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. అర్చకులు ఆశీర్వదించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో అంజయ్య, సూపరింటెండెంటు హరిహరనాథ్, ప్రధాన అర్చకులు చిరంజీవి, రామకృష్ణ, మల్యాల, కొడిమ్యాల మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



అంజన్న ఆలయంలో గండదీపం వద్ద మొక్కుతున్న అరికపూడి గాంధీ, మేడిపల్లి సత్యం

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

మేడిపల్లి, న్యూస్‌టుడే: మేడిపల్లి, బీమారం మండలాల్లో పీఆర్టీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు నిర్వహించారు. భోజన విరామ సమయంలో రెండు మండలాల్లోని పాఠశాలలను సందర్శించి ఓటు నమోదు చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినిపల్లి ప్రసాద్ రావు, జిల్లా బాధ్యుడు గడ్డం తిరుమల్ రెడ్డి, భీమయ్య, మండల శాఖ అధ్యక్షుడు సందెల్లి మల్లల్ రావు, నాగమల్ల రమేశ్, రాజేందర్ పాల్గొన్నారు.



కొండాపూర్‌లో ఓటు నమోదు చేస్తున్న పీఆర్టీయూ నాయకులు

నేడు అవగాహన సమావేశం

కోరుట్ల: ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదుకు నవంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కిషన్ మంగళవారం తెలిపారు. దీనిపై బుధవారం ఉదయం 11 గంటలకు కోరుట్ల మండల పరిషత్తు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల, యువజన సంఘాల, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

తాట్లవాయిలో డీఎస్పీ విచారణ

రాయికల్, న్యూస్‌టుడే: రాయికల్ మండలంలోని తాట్లవాయి గ్రామానికి చెందిన పాలెపు సురేశ్‌ను ఆకుల మల్లేశం, నందగిరి గోపాల్ అనే వ్యక్తులు కులం పేరుతో దూషించి దాడి చేశారని అందిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. గ్రామంలో మంగళవారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ విచారణ చేసి వివరాలు సేకరించారు. ఆయన వెంట జగిత్యాల గ్రామీణ సీఐ కృష్ణారెడ్డి, ఎస్ఐ సుధీర్‌రావు తదితరులున్నారు.

ధాన్యం కేంద్రాల ఏర్పాటుకు చర్యలు

జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే: జిల్లాలో వానాకాలం ధాన్యం సేకరణకుగాను 421 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి జితేందర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల్లో వరి నూర్పిడులు ప్రారంభంకాగా కేంద్రాలకు ధాన్యం రాకను బట్టి సేకరణను ప్రారంభిస్తామన్నారు. ప్యాక్స్, ఐకేపీ, మెప్మా ద్వారా 421 కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా ఇందులో కొన్నింటి ద్వారా ప్రత్యేకంగా సన్నగింజ వరిధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రంచేసి విక్రయానికి సిద్ధం చేసుకోవాలని సూచించారు.

పెద్దాపూర్ గురుకుల పాఠశాల పరిశీలన

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను ఆర్డీవో శ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. ఆవరణలో పోసిన మట్టిని చదును చేయాలని సూచించారు. ప్రహరీ పక్కన గుంతలుంటే పూడ్చాలని చెప్పారు. పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. విద్యార్థుల హాజరు, తరగతుల నిర్వహణను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ మాధవీలత, ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామకృష్ణ తదితరులున్నారు.

సంక్షిప్తం

అనుమతులు ఇప్పించాలని వినతి

కోరుట్ల: కథలాపూర్‌లోని అంబేడ్కర్ మాదిగ సంఘ సభ్యులకు మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డప్పులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు న్యావనంది శేఖర్ సొంత డబ్బులతో 16 మంది డప్పు కళాకారులకు డప్పులు, టీషర్ట్‌లు కొనిచ్చారు. అంతకముందు స్థానిక రామాలయంలో జరిగిన మండల పూజలో ప్రభుత్వ విప్ పాల్గొని పూజలు చేశారు. రెడ్డి జన సంక్షేమ సంఘ సభ్యులు ప్రభుత్వ విప్‌ను వేములవాడలో కలిశారు. దుంపేట శివారులోని వరద కాలువ స్థలంలో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి అనుమతులు ఇప్పించాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నారాయణరెడ్డి, సత్యనారాయణ, ఆనంతరెడ్డి, మహిపాల్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, భూమరెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్ ఏఈగా దివాకర్‌రావు

కోరుట్ల: కథలాపూర్ మండల విద్యుత్తు శాఖ ఏఈగా దివాకర్‌రావును నియమిస్తు జిల్లా ఎస్ఈ సాలియానాయక్ మంగళవారం ఉత్తర్వులు జారీ జేశారు. ఇక్కడ పని చేసిన ఏఈ జమీల్‌పాషా పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి బదిలీపై వెళ్లారు. గొల్లపెల్లిలో ఏఈగా పని చేస్తున్న దివాకర్‌రావు కథలాపూర్‌కు బదిలీపై వచ్చారు.

సంఘాలు- కార్యవర్గాలు

సారంగాపూర్: తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం జగిత్యాల జిల్లా కోశాధికారిగా మండలంలోని రంగపేటకు చెందిన పల్లపు చిన్నారెడ్డిని నియమితులయ్యారు. ఈ మేరకు ఫోరం ఛైర్మన్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు.

ఘన సన్మానం

జగిత్యాల విద్యానగర్: భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినాయక, దసరా నవరాత్రులు నిర్వహించిన సందర్భంగా భాజపా ఆధ్వర్యంలో పురపాలక అధ్యక్షురాలు అడువాల జ్యోతి, పురపాలక కమిషనర్ సమ్మయ్య, పట్టణ సీఐ ఎస్.వేణుగోపాల్‌లను మంగళవారం ఘనంగా సన్మానించారు. భాజపా నాయకులు ఏసీఎస్ రాజు, సీపెల్లి రవీందర్, సిరికొండ శ్రీనివాస్, ఆన్‌కార్ సుధాకర్, చీటి శేఖర్‌రావు, కిషోర్‌సింగ్, వీహెచ్‌పీ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, శ్రీనివాస్, సురేశ్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకం

జగిత్యాల: జగిత్యాల ఫాస్ట్ ట్రాక్ కోర్టు (పోక్సో) ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది చీటి రామక్రిష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ బి.సత్యప్రసాద్ అయిదుగురు న్యాయవాదుల పేర్లను ప్రతిపాదించగా ప్రభుత్వం రామక్రిష్ణారావును నియమించింది.



రామక్రిష్ణారావు

భాజపా సభ్యత్వ నమోదు

బుగ్గారం: స్థానిక మద్దునూరులో మంగళవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. నాయకులు రాంబాబు రాజేష్, సత్యం, అనీల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

గొల్లపల్లి: మండలంలోని చెందోలికి చెందిన దొనకొండ కృప అనారోగ్యంతో బాధపడున్న విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న విప్ లక్ష్మణ్‌కుమార్ రూ.2.50 లక్షల విలువైన ఎల్వోసీని కుటుంబసభ్యులకు మంగళవారం అందించారు. బాధిత కుటుంబ సభ్యులు విప్‌నకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామంపై మమకారంతో వైద్య శిబిరం

వెల్గటూరు: కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎండపల్లి మండలం గుల్లకోటలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గుల్లకోటకు చెందిన రామకృష్ణారెడ్డి తన గ్రామ ప్రజలకు సేవ చేయాలనే దృక్పథంతో రేకుర్తి కంటి ఆస్పత్రి సౌజన్యంతో వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో శస్త్ర చికిత్సలకు గుర్తించిన వారికి రేకుర్తి ఆస్పత్రికి మంగళవారం తరలించారు. వీరి సేవలను పలువురు కొనియాడారు.

ఎమ్మెల్యే పరామర్శ

మల్యాల: మల్యాల మండల కేంద్రానికి చెందిన బొట్ల వంశీ అనే యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి వైద్యులు అతడి కాలును తొలగించడంతో మంగళవారం ఎమ్మెల్యే సత్యం బాధితుడిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం పొన్నం బక్కుల తిరుపతి అనే గీత కార్మికుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు ఆదిరెడ్డి, మ్యాకలక్ష్మణ్, శ్రీనివాస్‌గౌడ్, వంశీ, రాజేశ్వర్‌రెడ్డి, తిరుపతి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణానికి కృషి

జగిత్యాల, న్యూస్‌టుడే: పండగలు ప్రశాంతంగా జరిగేలా పోలీసుశాఖ అన్ని విధాలా సహకరిస్తుందని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లాలో వినాయకచవితి, బతుకమ్మ, దసరా, దుర్గానవరాత్రులు ప్రశాంతంగా జరిగిన నేపథ్యంలో విశ్వహిందూ పరిషత్తు, హిందూ సంఘాల ప్రతినిధులు మంగళవారం జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పండగలు ప్రశాంతంగా జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించారని ఇదే స్ఫూర్తితో మున్ముందు ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని సూచించారు. డీఎస్పీ డి.రఘుచందర్, పట్టణ ఇన్‌స్పెక్టర్ సూరం వేణుగోపాల్, వివిధ సంఘాల ప్రతినిధులున్నారు.



ప్రతినిధులతో ఎస్పీ, డీఎస్పీ, సీఐ

అంజన్న ఆలయ జూనియర్ అసిస్టెంటుపై సస్పెన్షన్ వేటు

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు అంజన్న ఆలయ నిత్యాన్నదాన సత్రం ఇన్‌ఛార్జిగా విధులు నిర్వర్తిస్తున్న కె.రాములును మంగళవారం సస్పెండు చేసినట్లు ఆలయ ఈవో రామకృష్ణారావు ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న అన్నదాన సత్రం నుంచి 50 కిలోల బియ్యం, ఇతర సరకులను రాములు తస్కరించినట్లు సీసీ పుటేజీల ద్వారా గుర్తించినట్లు వివరించారు. సరకులను గ్యాస్ ఏజెన్సీకి చెందిన ఆటోలో తరలించినట్లు తేలడంతో ఆటో డ్రైవరు కె.సురేశ్ ఇచ్చిన స్టేట్‌మెంటును అనుసరించి అన్నదానం ఇన్‌ఛార్జి రాములును విధుల నుంచి సస్పెండు చేసినట్లు ఈవో పేర్కొన్నారు. అన్నదాన సత్రం ఇంఛార్జిగా మరో జూనియర్ అసిస్టెంటు ధర్మేంధర్‌కు నిర్వహణ బాధ్యతలు అప్పగించినట్లు ప్రకటనలో తెలిపారు.

చెక్కుల పంపిణీ

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదిముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. 119 మంది లబ్ధిదారులకు రూ.1,19,13,804ల విలువ గల కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను.. 43 మందికి రూ.10,15,500ల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ పంపిణీ చేశారు.



కోరుట్ల క్యాంప్ కార్యాలయంలో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే డా.సంజయ్

రాయికల్: రాయికల్ మండలం జగన్నాథపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచి షీడెం భీం చికిత్స నిమిత్తం రూ.44 వేలు మంజూరు కాగ కాంగ్రెస్ నాయకులు మంగళవారం అందజేశారు. మంజూరు చేయించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.శంకర్ తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1998-2000 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 24 ఏళ్ల తర్వాత కలుసుకొని నాటి రోజులను గుర్తుచేసుకుంటూ సంతోషంగా గడిపారు.

డీఎస్పీ తనిఖీ

సారంగాపూర్, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణలో ఎప్పటికప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ రఘుచందర్ సూచించారు. మంగళవారం బీర్‌పూర్ ఠాణాను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రాత్రి వేళల్లో దొంగతనాలు నిలవరించేందుకు గస్తీ పెంచాలని, రికార్డులను పరిశీలించి, నేరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపినందుకు జైలు

జగిత్యాల, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జగిత్యాల న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా పొలాస గ్రామానికి చెందిన భద్రి వెంకటి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో మంగళవారం హాజరుపర్చగా ద్వితీయ శ్రేణి ప్రత్యేక మెజిస్ట్రేట్ గంప కరుణాకర్ నాలుగు రోజుల జైలు శిక్ష విధించారు.

ఆకతాయిల బీభత్సం

రాయికల్, న్యూస్‌టుడే: రాయికల్ మండలం తాట్లవాయి ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఆకతాయిలు బీభత్సం సృష్టించారు. దసరా సెలవుల అనంతరం మంగళవారం పాఠశాలకు ఉపాధ్యాయులు వచ్చేసరికి తలుపులు విరగ్గొట్టి ఉన్నాయి. ఎనిమిది ఫ్యాన్లు ధ్వంసం కావడం, పలు రికార్డులు చిందరవందరగా పడిపోవడంతో ఉపాధ్యాయులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.



తాట్లవాయి పాఠశాలలో చెల్లాచెదురుగా రికార్డులు

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నీళ్లు కరవు

న్యూస్‌టుడే, కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నీళ్లు కరవయ్యాయి. క్యాంపు ఆవరణలోని బోరుబావి సుమారు 8 నెలల క్రితం దెబ్బతింది. పరిశీలించిన సిబ్బంది.. బోరుబావి కూలిపోవడంతో అది పనికిరాదని.. కొత్త బోరు వేయాలని సూచించారు. బల్దియా అధికారులు పురపాలక సంఘం సాధారణ నిధుల్లోంచి రూ.1.80 లక్షల నిధులను కేటాయించినా.. ఇప్పటివరకు బోరుబావిని తవ్వించకుండా బల్దియా అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. నాలుగు రోజులకోసారి నీటి ట్యాంకర్ తెప్పించి దానికి తాత్కాలిక పద్ధతిలో విద్యుత్తు మోటారును అమర్చి భవనం పైనున్న ట్యాంకును నింపి వాడుకుంటున్నారు. నీళ్లు ఎప్పుడు అయిపోతాయో తెలియకపోవడంతో తరచూ సమస్య తలెత్తుతోంది. వివిధ పనుల నిమిత్తం క్యాంప్ కార్యాలయానికి వచ్చే ప్రజలు, అధికారులు, నాయకులు.. మరుగుదొడ్లలో నీళ్లు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. బోరుబావి సమస్యను పరిష్కరించాలని కార్యాలయానికి వచ్చేవారు కోరుతున్నారు.



ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న బల్దియా సిబ్బంది